క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: తొర్రూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మునగనూర్‌లోని అన్ని కాలనీలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తొర్రూర్‌లోని అన్ని కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: బండరావిరాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కెవీ ఫీడర్ తీగల కింద చెట్ల కొమ్మలను నరికివేయనున్న కారణంగా గురువారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బండరావిరాల, బాచా రం గ్రామాలతో పాటు వ్యవసాయ, పరిశ్రమ ల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ విద్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు.

లబ్ధిదారులకు కార్ల పంపిణీ



లబ్ధిదారుడికి కారు తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కార్లను బుధవారం క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పోచారం గ్రామానికి చెందిన ఈర్లపల్లి నరేందర్, ఎల్మినేడు గ్రామానికి చెందిన జోగు స్వామిలకు మంజూరైన కార్లను ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి వారికి కారు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, మహిళ అధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవ ర్యాలీ



నులిపురుగుల నివారణ ర్యాలీలో వైద్య సిబ్బంది

కడ్తాల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈవో సుదీర్‌బాబు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మైసిగండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరం వయస్సు నుంచి 19 సంవత్సరాలలోపు బాల బాలికలకు నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని కోరారు.

విశ్వరూప సభకు ఎమ్మార్పీఎస్ నాయకులు



సభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు: మహేశ్వరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మాదిగల విశ్వరూప సభకు ఆమనగల్లు మండలం నంచి ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. జిల్లా నాయకులు పులికంటి మైసయ్య, మల్లెపోగు మల్లేశ్, శివ, వస్పుల సాయిలు, విజయ్‌చందర్, రోషయ్య, సామేల్, రాములు, బాలయ్య, మహేశ్, వేణు, నర్సింహ, భరత్, విష్ణు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కడ్తాల్: రావిచేడ్ గ్రామానికి చెందిన కోమలపల్లి మల్లేశ్ మంగళవారం జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్ రెడ్డి, రావిచేడ్ ఎంపీటీసీ గోపాల్ బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి రూ.5వేలు, రూ.3వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాల్లో పిన్‌కోడ్ రాయాలి

రాయపోల్ సబ్‌పోస్ట్ మాస్టర్ జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: పిన్‌కోడ్ నెంబరు కరెక్టుగా రాస్తేనే సకాలంలో ఉత్తరాలు అందుతాయని రాయపోల్ సబ్‌పోస్ట్‌మాస్టర్ జె. జంగయ్య పేర్కొన్నారు. రాయపోల్ పోస్టాఫీస్ పరిధిలో 501508 పిన్‌కోడ్ నెంబరు ఉపయోగించాలని, ప్రజలు దీనిపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఆరుట్ల, దండుమైలారం, జపాల్, లింగంపల్లి, పోల్కంపల్లి, మంచాల్, రంగాపూర్, తాళ్లపల్లిగూడ గ్రామాల ప్రజలు తప్పని సరైన పిన్‌కోడ్ నెంబరుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని సూచించారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు



ఆమనగల్లు: విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త



యాచారం: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో సిబ్బంది

- శిథిలావస్థకు చేరుతున్న భవనాలు
- పట్టించుకోని అధికారులు
- పూర్తి స్థాయిలో హాజరు కాని చిన్నారులు

ఆమనగల్లు: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ఇక్కడ అరకొర వసతులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మాత, శిశు సంరక్షణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు ఆమనగల్లు మున్సిపాలిటీలో సజావుగా సాగుతున్నప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఆమనగల్లులో 10 కేంద్రాలు ఉండగా కేవలం రెండు కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయని, మిగతా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె బవనాల్లో కొనసాగుతున్నాయి. ఎస్సీ కాలనీలోని ఆరో అంగన్‌వాడీ కేంద్రాన్ని సాక్షి విజిట్ చేసింది. ఈ సమయంలో అంగన్‌వాడీ కేంద్రంలో 9 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో నలుగురు పోషకాహార లోపంతో ఉండగా వారికి బాలామృతం ప్లస్ ప్యాకెట్లు అందిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్త సంధ్య వివరించారు. మిగతా విద్యార్థులకు అన్నం, పప్పు, గుడ్లు, పాలు అందిస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రతి నెల విద్యార్థుల బరువు నమోదు చేయడంతో పోషకాహార లోపాన్ని గుర్తించొచ్చన్నారు.

'అంగన్‌వాడీల'పై పర్యవేక్షణ కరువు

యాచారం: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, పర్యవేక్షణను ఉన్నతాధికారులు గాలికొదిలేశారు. యాచారం మండలంలోని 24 గ్రామాల్లో 0–6 ఏళ్ల లోపు చిన్నారులు వేలల్లో ఉన్నప్పటికీ 10శాతం కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం లేదు. చిన్నారులకు పౌష్టికాహారంతో కూడిన పాలు, గుడ్లు, పప్పు భోజనం ఉచితంగా అందిస్తున్నా చిన్నారులను ఈ కేంద్రాలకు తీసుకొచ్చేవిషయంలో అధికారులు, సిబ్బంది పట్టిచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొత్తపల్లి తండా, నల్లవెల్లి తండా, ఎర్రగొల్లతండా, మాల్, నక్కర్తమేడిపల్లి–2, పిల్లిపల్లి, మీసాలతండా, కేసీతండా తదితర గ్రామాల్లో అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల భవనాల్లోనే నడస్తున్నాయి. యాచారంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో మొత్తం చిన్నారుల సంఖ్య 14 మంది ఉండగా, బుధవారం ఆరుగురే హాజరయ్యారు. ఈ కేంద్రంలో చిన్నారులకు అందించే పాలు, గుడ్లు, పప్పులు, బియ్యం అన్ని సరుకులు ఉన్నప్పటికీ పూర్తి సంఖ్యలో చిన్నారులు రావడం లేదు. ఈ విషయంలో చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించే వారు కరువయ్యారు. ఈ విషయం గురించి అంగన్‌వాడీ కేంద్రాల ఇన్‌చార్జి తులసిని వివరణ కోరగా యాచారం మండలంలోని పలు గ్రామాల్లో 5వేలకు పైగా చిన్నారులు ఉన్నట్లు, అందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని, ముఖ్యంగా చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలి. అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భవనాలకు సంబంధించిన అద్దె, పెండింగ్‌లో ఉన్న గ్యాస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

– సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్త, ఆమనగల్లు

మండలం సాధించేవరకు పోరాటం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి



గట్టుఇప్పలపల్లి దీక్షలో మద్దతుగా చంద్రశేఖర్‌రెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంత వరకు పోరాటం చేస్తామని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గట్టుఇప్పలపల్లి మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు బుధవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా చ్రంశేఖర్ రెడ్డి మాట్లాడుతూ దీక్షలు చేపట్టి 31 రోజులుగా గడుస్తున్నా ప్రభుత్వం స్పదించక పోవడం బాధాకరమన్నారు. మండలం ఏర్పాటు చేయాలని సర్పంచ్, ఉప సర్పంచ్‌తో పాటు, పాలకవర్గ పంచాయతీ వార్డు సభ్యులు ఇటీవల తమ పదవులకు రాజీనామాలు చేసినా కూడా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దామోదర్, డేవిడ్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాజు, రాజశేఖర్, రేణురెడ్డి, చెన్నయ్య, జంగయ్య, లక్ష్మణ్, సాయిరాం, నర్సింహ, గోపాల్, మోహన్ రెడ్డి, నారాయణ, లక్ష్మీపతి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విభేదాలు లేకుండా సమన్వయం చేయాలి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో విభేదాలు, గ్రూపులు లేకుండా సమన్వయం చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ నాయకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కోరారు. ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యేను వివిధ మండలాల అధ్యక్షులు పరమేశ్, జైపాల్‌రెడ్డి, పానుగోటి అర్జున్‌రావ్, శంకర్, భూపతిరెడ్డి, ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, కల్వకుర్తి మా ర్కెట్‌చైర్మన్ విజయ్‌గౌడ్, దోనాదుల కుమార్, వెంకట్‌రెడ్డి, వడ్డె వెంకటేశ్, లాలయ్యగౌడ్, గుమ్మకొండ రాజు, చుక్క నిరంజన్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు విన్నవించారు.

పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి అరుణకుమారి

ఆమనగల్లు: పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి, మంగళపల్లి, మేడిగడ్డతండాల్లో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో జింక్‌లోపం నివారణకు లీటర్ నీటిలో జింక్ సల్ఫేట్ 2 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు పటేరా గుళికలను ఎకరాకు 4కిలోల ఇసుకలో కలిపి పొలంలోచల్లాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌గా అశోక్‌రెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్‌గా అశోక్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అనితారెడ్డి హైదరాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. దీంతో ఆమె స్థానంలో యాదాద్రి జిల్లా రామన్నపేటలో పనిచేస్తున్న అశోక్‌రెడ్డి అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీపై వచ్చారు. బుధవారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఇళ్ల నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూత



ఆమనగల్లు: ఇంటి నిర్మాణానికి ఇటుకలు అందించిన ఉప్పల ట్రస్టు సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో నిరుపేద ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూతనందించింది. గ్రామానికి చెందిన కంబాలపల్లి ఈశ్వరమ్మ, నర్రపెద్దమ్మల ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఇంటి నిర్మాణానికి మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించాడు. మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన యాదమ్మ, మల్లేష్‌ల నూతన ఇంటి నిర్మాణాలకు బుధవారం సిమెంట్, స్టీల్, కాంక్రీట్, ఇటుక, తదితర మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘుపతి, తదితరులున్నారు.

కొనసాగుతున్న సమ్మె

యాచారం: పంచాయతీల్లో పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, నెలకు రూ.20 వేలకు తగ్గకుండా జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె బుధవారం కూడా కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయం ఎదుట మహిళలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. అనంతరం పంచాయతీ ఉద్యోగ కార్మిక మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చందునాయక్, అధ్యక్షుడిగా బోడ కిష్టయ్య, కార్యదర్శిగా నరేందర్, ఉపాధ్యక్షుడిగా రాము, శరణం, పరమేశ్, సహాయ కార్యదర్శులుగా మైసమ్మ, కవిత, అరుణ, కోశాధికారిగా లింగస్వామిని ప్రకటించారు.

మంచాలలో..

మంచాల: గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంచాల మండల కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల మాజీ సర్పంచ్ యాదయ్య, ఉప సర్పంచ్ పాండాల జంగయ్య గౌడ్, మారయ్య, జంగయ్య వెంకటేశ్, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారం అందజేత



పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్, తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం అందజేస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత పేర్కొన్నారు. పాలు, గుడ్లు, అన్నం పప్పు, తదితర ఆహారపదార్థాలను చిన్నారులకు ప్రతీరోజు అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 57 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 10 అద్దె భవనాల్లో, 44 ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో, 3 దాతల సహాయంతో నడుస్తున్నాయని చెప్పారు. మండల పరిధిలోని పెద్దూర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో 15 మంది పిల్లలుండగా, వారు ఎత్తుకు తగ్గ బరువును కలిగి ఉన్నారన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం

వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి



మంగళపల్లి పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అనంతరెడ్డి

ఆమనగల్లు: మంగళపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని మండల వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి చెప్పారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జక్కు అనంతరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. మన ఊరు.. మన బడి క్రింద వచ్చిన నిధులతో అదనపు తరగతి గదులు నిర్మించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మురళి, వెంకటేశ్, యాదయ్య, తానయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్క నాటుతున్న రాంపాల్‌నాయక్, బాల్‌రాం

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, ఎస్ఐ బాల్‌రాంలు కోరారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్క నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్, ఏఎస్ఐ యాదయ్య, ప్రధానోపాధ్యాయురాలు పద్మ, పీఈటీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఆరోవార్డులో రూ.2 లక్షలతో నిర్మి స్తున్న భూగర్భ మురుగు కాల్వ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ దివ్యశ్రీకాంత్‌సింగ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పనులను సకాలంలో పూర్తిచేయాలని మున్సిపల్ ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీదర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్



ఆమనగల్లు కస్తూర్బా విద్యాలయంలో సభ్యత్వం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

ఆమనగల్లు: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి, ఆమనగల్లు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన పీఆర్‌టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం పీఆర్‌సీ కమిషన్ వేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన కోరారు. పీఈటీ, పండిట్ పోస్టులు అప్‌గ్రేడేషన్, 317 జీఓ ద్వారా ఇబ్బంది పడ్డ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి చంద్రం, పద్మజారాణి, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి..గుంతల మయం

ఇబ్బందుల్లో వాహనదారులు



హయత్‌నగర్–దండు మల్కాపూర్ మధ్య వర్షాలకు ఏర్పడిన గుంత

అబ్దుల్లాపూర్‌మెట్: నిత్యం వేలాది వాహనాలతో కిటకిటలాడే జాతీయ రహదారి గత మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంలుదు ఎదుర్కొంటున్నారు. హయత్‌నగర్ నుంచి దండు మల్కాపురం వరకూ వేల సంఖ్యలో గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు చేరి వాహనదారులకు రోడ్డు ప్రయాణం నరకంగా మారింది. దీంతో ఇక్కడ ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఓ వైపు జాతీయ రహదారి విస్తరణ జరుగుతుండగా మరో వైపు రోడ్డు ఇలా గుంతలుగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో అయితే ఆచితూచి ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించి విజయవాడ జాతీయ రహదారిపై ఇరువైపులా ఏర్పడిన గుంతలను మరమ్మత్తులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సింహ



మాట్లాడుతున్న కావలి నర్సింహ్మా

ఇబ్రహీంపట్నం: పేదలకు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఇబ్రహీంపట్నం మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లులేని నిరుపేదలు కొన్నేండ్లుగా ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ఇండ్లు కూలిపోయి పలువురు నిరాశ్రయులైనట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో లక్ష్మయ్య, నీలమ్మ, కృష్ణ, ములుగు నర్సింహ్మా పాల్గొన్నారు.

హనుమండ్ల రఘుపతికి డాక్టరేట్



ఇబ్రహీంపట్నం రూరల్: విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న హనుమండ్ల రఘుపతికి డాక్టరేట్ అవార్డు ప్రధానం చేశారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడకు చెందిన ఆయన ఎంజీఆర్ యూనివర్శిటీలో డిజైన్ ఆఫ్ ఇంటిలిజెంట్ ట్రాన్స్‌పార్మేషన్ సిస్టం యూజింగ్ డీఎస్ఎస్, సీఎస్ఎస్ ఫర్ ట్రాఫిక్ సైన్ డిటెక్షన్ అనే అంశంపై పరిశోధనలు చేసి అదే విభాగంలో పీహెచ్‌డీ పట్టాను పొందాడు. ఈ సందర్భంగా విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ డి. రమేష్, చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, కోశాధికారి శ్రీధర్‌రెడ్డిలు అభినందించారు.

క్రమశిక్షణ, కఠోరశ్రమతో ఎంపికయ్యా..

ఎస్ఐ అభ్యర్థి మౌనికకు సన్మానం



ఖానాపూర్‌లో మౌనికను సన్మానిస్తున్న ఎంపీటీసీ, తదితరులు

తలకొండపల్లి: క్రమశిక్షణతో పాటు కఠోరమైన శ్రమతో ఎస్ఐగా ఎంపికయ్యానని ఎస్ఐ అభ్యర్థి మౌనిక పేర్కొన్నారు. ఎస్ఐగా ఎంపికైన ఆమెను ఎంపీటీసీ సరిత, గణేషుగుప్తాలు ఘనంగా సన్మానించారు. మండల పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన కిషన్, శాంతమ్మల కుమార్తె మౌనిక ఇటీవల నిర్వహించిన పోలీస్ ఈవెంట్స్, పరీక్షల్లో మౌనిక ఉత్తీర్ణత సాధించింది. మంగళవారం ప్రకటించిన ఎస్ఐ పరీక్షా ఫలితాల్లో మౌనిక ఎంపికైందని తెలుసుకున్న ఎంపీటీసీ, జాప్రతినిధులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు ఆమెఇంటికి వెళ్లి మౌనికను శాలువా కప్పి సన్మానించారు. మరింత ఉన్నత పదవులును అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ ఎస్ఐ ఉద్యోగంతో పేద ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం మహానందంగా ఉందన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

ఆదిభట్ల సీఐ రఘువీర్ రెడ్డి



తుర్కయంజాల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

తుర్కయంజాల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదిభట్ల సీఐ రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం రాగన్నగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫేస్ బుక్, ట్విట్టర్, సోషల్ మీడియా ఉపయోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో

అబ్దుల్లాపూర్‌మెట్: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్ఐ వెంకట్రాంరెడ్డి సూచించారు. గుంతపల్లి గ్రామంలోని అవంతి విద్యాసంస్థల ఆవరణలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త, కొత్త విధానాలను ఎంచుకుంటున్నారని, వారి వలలో పడి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. ఈ విషయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైన ఫోన్ చేసి మీ బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీలు చెప్పాలని కోరితే ఎలాంటి సమాచారం ఇవ్వకూడదన్నారు. మొబైల్‌యాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, వాట్సాప్‌ల ద్వారా విద్యార్థినులను ఎవరైనా ఇబ్బందులు పెడితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, బాలాజీ, పీఆర్‌ఓ శ్రీనివాస్‌నాయుడు, ఏఓ పిచ్చిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.